క్లుప్తంగా



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో గురువారం కలిశారు. గణేష్ తన ఇద్దరు కుమారులు అవినాష్, ఆదర్శ్‌ను జగన్‌మోహన్‌రెడ్డికి పరిచయం చేశారు.
- నర్సీపట్నం

వైభవంగా కామధేనువు అమ్మవారి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని శెట్టినాలెంలో గురువారం కామధేనువు అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించారు. ఊరికి దూరంగా ఉన్న ఆలయానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

గొలుగొండ : మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వ్యవసాయశాఖ ఏవో సుధారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఖరీఫ్‌కు ముందే వీటిని రైతులకు అందించడం వలన సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపి, రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. స్వామిని అందంగా అలంకరించారు. ఈ నెల 22వ తేదీన స్వామివారి నాగవల్లి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు తెలిపారు. ఈ సంబరాలలో భాగంగా ఉదయం స్వామి వారికి చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు పుష్పాంజలి సేవ, ఊంజల్ సేవ, అనంతరం దర్పణ దర్శనంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వి.సత్యనారాయణ అన్నారు. నీటి పొదుపుపై కె.కోటపాడు హైస్కూల్ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వ్యక్తి రోజుకు 55 లీటర్ల నీటిని మాత్రమే ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులు సురక్షిత నీటిని మాత్రమే తాగాలన్నారు. కలుషిత నీరు అనారోగ్య సమస్యలకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బోకం ఎర్రునాయుడు, మురళీకృష్ణ, బోర్ మెకానిక్ కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

- 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఎంఈవోలు, ఉపాధ్యాయులు
- గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు



బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని విద్యార్థుల మానవ హారం

చోడవరం రూరల్: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడికే పంపించాలని మండల విద్యాధికారులు జయలక్ష్మి, సింహాచలం కోరారు. మండలంలోని గజపతినగరం, అంభేరుపురం గ్రామాల్లో గురువారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులచే ప్రదర్శనలు చేపట్టారు. 6 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలు పాఠశాలలోనే ఉండాలని, ఎటువంటి పనుల్లోను చేర్చరాదని ఈ సందర్భంగా ఎంఈవోలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అటువంటి పిల్లలను గుర్తించి వారిని బడుల్లో చేర్చడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.నాగరాజు, ఎస్.భాస్కరరావు, సీఆర్ఎంటీ కె.వి.ఎం.నాయుడు, గజపతినగరం కార్యదర్శి యశ్వంత్, సంక్షేమ సహాయకులు మహేష్, హరిత, మానవ పాఠశాల కమిటీ చైర్మన్ సన్యాసిరావు, జగ్గప్పారావు, శ్రావణి, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి చదువు.. ప్రగతికి మలుపు

రోలుగుంట: మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు సంయుక్తంగా నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల నుంచి గ్రామ వీధిలో ర్యాలీ చేశారు. విద్యా ప్రాధాన్యాన్ని వివరిస్తూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, విద్యార్థి చదువు.. ప్రగతికి మలుపు, నా బడి నా విద్య, ప్రభుత్వ పాఠశాలలో చేరుదాం.. ప్రభుత్వ రాయితీలు పొందుదాం అనే నినాదాలు చేశారు. హెచ్‌ఎం కిల్లాడ నాయుడుబాబు మాట్లాడుతూ విద్యార్థుల భవితవ్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయిలు హెచ్చించి ఉచితంగా అర్హత గల ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన అందస్తోందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలను గుర్తించుకుని ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. 0 నుంచి బడి ఈడు వరకూ మాతాశిక్ష సంక్షేమం ద్వారా చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, శారీర దారుఢ్యం, క్రమపద్ధతిలో వయసు ఆధారంగా ఆహారం, ఆరోగ్య పరీక్షలు విధిగా చేయిస్తూ, అక్షర జ్ఞానం అందిస్తున్నామని స్థానిక అంగన్‌వాడీ టీచర్ సిహెచ్.వరలక్ష్మి తెలిపారు, కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల టీచర్ ఎస్.రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిబాటపై అవగాహన ర్యాలీ

నాతవరం: బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడమే ధ్యేయంగా పనిచేయాలని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బడికి పోదాం కార్యక్రమంపై విస్తృతంగా ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే సమాజాభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు గ్రహించి తాము చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యా కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు సంయుక్తంగా పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, సీఆర్పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగుల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..

మాడుగుల: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యా శాఖాధికారి బి. దేముడమ్మ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఈసీడీఎస్ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంఆర్‌సీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఈసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, సూపరింటెండెంట్ గోపాల్, ఎంఆర్‌సీ సిబ్బంది నాగేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.



కంచుగుమ్మలలో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న హెచ్‌ఎం నాయుడుబాబు, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి



పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో-2 వరహాలబాబు తదితరులు

ముగ్గురు విద్యార్థుల చేరిక

మాకవరపాలెం: నేను బడికి పోతా కార్యక్రమంలో ముగ్గురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించామని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. తామరం-2 ప్రాథమిక పాఠశాలలో గురువారం ముగ్గురు పిల్లలను చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. తూటిపాలలో విద్యాప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఒకటో తరగతి విద్యార్థులకు పెన్సిల్ చెక్కిన వ్యర్థాలతో వివిధ ఆకృతులు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. విద్యాప్రదేశ్ కార్యక్రమం 90 రోజులు జరుగుతుందని హెచ్‌ఎం కె.రాము తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాడుగుల జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎంఈవో దేముడమ్మ



తామరం-2 ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయులు

యోగాతో ఎన్నో ప్రయోజనాలు



యోగా సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు

చోడవరం రూరల్: మూడు ప్రధానమైన ఆరోగ్య ప్రయోజనాలు పొందడానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ అన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్లు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం యోగా దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫిజికల్ ఫిట్‌నెస్, మానసిక ప్రశాంతత, చక్కని ఆరోగ్యం యోగా సాధన ద్వారా లభిస్తాయన్నారు. ఈ రకమైన యోగాలు ఉన్న ప్రతి ఒక్కరూ విజయాలను అందుకోవచ్చని చెప్పారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకుడు ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం యోగా పుట్టినిల్లన్నారు. యోగ సాధన ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ దేశం గనుక.. ఆది నుంచి వ్యవసాయమే ఒక యోగంగా విలసిల్లుతోందని తెలిపారు. ప్రస్తుత ఆహారపు అలవాట్ల కారణంగా సంక్రమించే రోగాలను యోగ సాధన ద్వారా అదుపు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ అధ్యాపకులు హెచ్.సుధీర్, ఎస్ఎం.రఫియుద్దీన్, ఐ.వి.వి.సత్యవతి, సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పికొండమ్మ జాతర



ఆలయం వద్ద భక్తుల సందడి

గొలుగొండ: ఏఎల్ పురంలో అప్పికొండమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. గ్రామంతోపాటు సమీప గ్రామస్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కులు సమర్పించుకున్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించండి



నేతవానిపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో విశ్వేశ్వరరావు

బుచ్చెయ్యపేట: పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలని ఎంఈవో బి.కె.ఎస్.విశ్వేశ్వరరావు తెలిపారు. దిబ్బిడి, నేతవానిపాలెం, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లోని పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలను సరఫరా చేసింది లేనిది పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, స్కూల్ రికార్డులను పరిశీలించారు. నేతవానిపాలెంలో విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనాలను పరిశీలించి రుచి చూశారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించాలని, వారంలో ఐదు రోజులు తప్పనిసరిగా కోడిగుడ్డు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోషకాహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని, చదువులో బాగా రాణిస్తామని విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు కార్యాచరణ



తాటిపర్తి పాఠశాలలో మాట్లాడుతున్న వైద్యాధికారి లీలాప్రసాద్

మాడుగుల రూరల్: 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. లీలాప్రసాద్ పేర్కొన్నారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం ఈ వ్యాధి నిర్మూలనపై గిరిజన మహిళలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ల మధ్య ఉన్న 7 కోట్ల మందికి అవగాహన కల్పించాలని భావిస్తుందన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు ఈ వ్యాధి లక్షణాలన్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ. 10 వేలు పింఛను ఇస్తుందన్నారు. తాటిపర్తి పంచాయతీలో ఒకరు ఈ పింఛను అందుకుంటున్నట్లు తెలిపారు. సమావేశానికి కె.జె.పురం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి చింతాడ పుష్పమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి నాగశిరీష, ఏఎన్ఎం సువర్ణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఆరోగ్య సహాయకులు నీలాంబరం, ఆశ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చక్కటి విద్యతో ఉన్నత భవిత



కేజీబీవీ విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ చిన్నమ్మలు

కె.కోటపాడు: బాలికలు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత ఉద్యోగావకాశాలు పొందవచ్చని కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు అన్నారు. కస్తూరీబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వం బాలికా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తల్లిదండ్రుల ఆశలను విద్యార్థినులు చదువుతో నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కింతలి వల్లాపురం పాఠశాలలో..

మాడుగుల : మండలంలో కింతలి వల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, ఎంపీటీసీ బగుడు వరహాలమ్మ, ఉపసర్పంచ్ మట్టా గోవింద్, పంచాయతీ సెక్రటరీ అప్పారావు, గ్రామస్తులు రాంబాబు, సీతారామయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెం ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మతులతో పాటు చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని నర్సీపట్నం డీఈ రామకృష్ణ తెలిపారు. ముషిడిపాలెం, పాపయ్యపాలెం, బుచ్చన్నపాలెం, వీరపురాజుపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

అన్నవరం ఫీడర్ పరిధిలో రేపు..

చోడవరం రూరల్: పట్టణంలోని చోడవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్నవరం ఫీడర్ పరిధిలోని వెంకయ్యగారిపేట, అన్నవరం, ఎడ్లవీధి, చైత్ర నగర్, గాంధీ గ్రామం, సిటిజన్ కాలనీ, గోవిందమ్మ కాలనీ, అంకుపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

మోదకొండమ్మ పండగ విజయవంతం

మాడుగుల: ఈ నెల 18న మాడుగులలో జరిగిన మోదకొండమ్మ పండగ విజయవంతం అయిందని ఆలయ కమిటీ తెలిపింది. ఇందుకు తోడ్పాటునిచ్చిన ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పోలీసు, పంచాయతీ, వైద్య, ట్రాన్స్‌కో, ఫైర్ సిబ్బందితో పాటు గ్రామస్తులకు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

వసతి గృహంలో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు: మండలంలోని ఎ.కోడూరులో గల సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన సమీకృత బాలుర వసతిగృహంలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ అధికారి పి.గంగునాయుడు తెలిపారు. 3 నుండి 10వ తరగతి విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉన్న ఈ వసతి గృహంలో ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల విద్యార్థుల చేరికకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. చదువుతో పాటు విద్యార్థికి వసతి, సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో టీసీ, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ జిరాక్స్ కాపీలు, తల్లి బ్యాంక్ అకౌంట్ నంబర్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు విద్యార్థికి చెందిన మూడు పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకు రావాలన్నారు. వివరాలకు 77807 62670 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

దేవదాయ భూముల బహిరంగ వేలం



కంచుగుమ్మల దేవదాయ భూములకు వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

రోలుగుంట: అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలోని దేవదాయ శాఖకు చెందిన శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయ భూములకు గురువారం గ్రామ సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, గ్రామ పెద్దల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. మూడేళ్ల కాలవ్యవధికి సంబంధించి ఆలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటదారుల నుంచి ముందుగా ధరావత్తు సొమ్ము రూ.5,000 కట్టించుకుని, ఆధార్ కార్డులను అధికారులు తీసుకున్నారు. శాఖ సూపర్‌వైజర్ వెంకటాద్రి పాట నియమ నిబంధనలు చదివి వినిపించారు. పాత బకాయిదారుడు పాటలో పాల్గొనేందుకు ఆసక్తి చూపడంతో అతడు కట్టాల్సిన రూ.8,000 బకాయిని వసూలు చేసి పాటదారుల అనుమతితో అర్హత కల్పించారు.

పాటదారులు వీరే..

కంచుగుమల రెవెన్యూ 18:21/2 సర్వే నంబర్‌లోని భూముల వేలానికి పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. సర్వే నంబర్ 7లోని 5:11 సెంట్ల విస్తీర్ణం గల భూమిని పాడేందుకు పాటదారులు పోటీపడగా.. గౌరు రమేష్‌కుమార్ రూ.48 వేలకు హెచ్చుకు పాడి దక్కించుకున్నాడు. 224/1 సర్వే నంబర్‌లోని 3:14 సెంట్ల భూమిని శెట్టి రమణ హెచ్చుగా పాడి దక్కించుకున్నారు. వీరి అర్హతలాధారంగా కొత్తకోట గ్రూపు దేవాలయాలకు చెందిన ఆ శాఖ కార్యనిర్వహణాధికారి కె.బి.ఆశాకిరణ్మయి పాటను వారికి ఖరారు చేశారు. కార్యక్రమంలో పరవాడ నారాయణ దొర, పోస్టుదొర, పాటదారులు పాల్గొన్నారు.

రూ.31 కోట్లతో ఉపాధి హామీ పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం: ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది రూ. 31 కోట్ల మేర పనులు లక్ష్యంగా పెట్టుకున్నామని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షలో పాల్గొన్నారు. 2024-25 సంవత్సరంలో పలు అభివృద్ధి పనులు చేస్తామన్నారు. 7 లక్షల 80 వేల మంది కూలీలకు పని కల్పిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. మండలవ్యాప్తంగా పనుల కోసం ఖర్చు అయిన నిధులు, ఉపాధి కూలీలకు చేసిన చెల్లింపులు తదితర అంశాలను ఏపీవో చిన్నారావు వివరించారు. ఈ కార్యక్రమంలో టీసీ దేముడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్య పరిరక్షణ



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. గుల్లేపల్లి గ్రామంలో 123 మందికి గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులను తనిఖీ చేసి ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవించటం వల్ల తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

మాడుగుల రూరల్ : మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని మాడుగుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ కె. హనుమంతు పేర్కొన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ముందస్తుగా గురువారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సెబి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో అంగన్‌వాడీ చిన్నారులు, అధికారులు

చోడవరం రూరల్: ఐసీడీఎస్ రావికమతం ప్రాజెక్టు పరిధి మండలంలోని ఖండేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఉషారాణి మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లోకి అనుమతిస్తామని, ఐదేళ్లు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వారు ఒకటో తరగతిలో చేరేందుకు సంసిద్ధం చేస్తామని చెప్పారు. అదే రీతిలో గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహార నియమాలను తెలియపరచి ప్రభుత్వం సరఫరా చేసిన సరకులను వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ఎస్.పుష్పాదేవి, సూపర్‌వైజర్ డి.శ్రీదేవి, స్కూల్ టీచర్ ఆర్.సత్యనారాయణ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పనులపై సమావేశం

కె.కోటపాడు : కె.కోటపాడు మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.అప్పలరాజు తెలిపారు. 32 పంచాయతీల్లో వేతన, మెటీరియల్ రూపేణా జరిగిన సుమారు రూ.27 కోట్ల 69 లక్షల నిధులకు సంబంధించిన సామాజిక తనిఖీ అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వివిధ శాఖల్లో చేపట్టిన పనులకు సంబంధించిన అధికారులు, గ్రామాల్లో గల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్పీలు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని అప్పలరాజు తెలిపారు.